# నగరంలో ఒక్కరోజూ కర్ఫ్యూ లేదు

**కేసీఆర్ హయాంలోనే అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు**

- పేదోడి పక్షాన నిలిచిన ఏకైక పార్టీ బీఆర్ఎస్
- హ్యాట్రిక్ విజయంతో కేసీఆర్‌ను మరోసారి సీఎం చేయాలి
- జలవిహార్‌లో మైనార్టీ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి కేటీఆర్



జలవిహార్‌లో జరిగిన మైనార్టీ నేతల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, పలువురు నేతలు

సిటీబ్యూరో, అక్టోబర్ 30(నమస్తే తెలంగాణ): తెలంగాణ ఏర్పడ్డాక నగరంలో ఏ ఒక్కరోజూ కర్ఫ్యూ లేదని, గంగా, జమున, తెహజీబ్ తరహాలో మత సామరస్యం వెల్లివిరిసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. జలవిహార్‌లో హైదరాబాద్ జిల్లాలోని పలు నియోజకవర్గాలకు చెందిన మైనార్టీ నేతలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, ముఠా గోపాల్, మహమూద్ అలీ, మాగంటి గోపీనాథ్ పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నేతలు షేక్ అబ్దుల్ సోహైల్, అర్షమ్ ఆదిల్‌కు కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి మంత్రి కేటీఆర్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా మైనార్టీలను ఉద్దేశించి మంత్రి కేటీఆర్ ప్రసంగించారు. ఓట్ల కోసం తెలంగాణలో మత విద్వేషాలను బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రేరేపిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఇన్నాళ్లు ముస్లింలు, క్రిస్టియన్లను కేవలం ఓటు బ్యాంకుగానే చూసిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు... అధికారం కోసం బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేస్తున్నాయన్నారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత అన్ని మతాలకు ప్రాధాన్యతనిచ్చి, పేదోడికి సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా కేసీఆర్ పాలన కొనసాగించారని గుర్తు చేశారు.

గడిచిన 9ఏళ్లుగా ఎలాంటి అల్లర్లు, మత ఘర్షణలకు తావు లేదని, అన్ని మతాలకు ప్రాధాన్యతనిస్తున్న సీఎం కేసీఆర్ షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి వంటి పథకాలను అందజేస్తున్నారని తెలిపారు. ఇటీవల మిలాద్ ఉన్ నబీ, గణేశ్ నిమజ్జనం ఒకే రోజు వచ్చినా... హిందు మతానికి గౌరవిస్తూ సామరస్యంగా రెండు కార్యక్రమాలు జరుపుకొన్న విషయాన్ని గుర్తు చేశారు. ఆర్ఎస్ఎస్‌కు చెందిన రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరి, శాంతి, సామరస్యం నిండిన తెలంగాణను కల్లోలిత ప్రాంతంగా చేయాలని చూస్తున్నాడని కేటీఆర్ ఆరోపించారు. అన్ని మతాలను గౌరవిస్తూ కేసీఆర్ పండుగ కానుకలను అందిస్తున్నారు. ఇన్నాళ్లు దేశాన్ని పాలించిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ముస్లిం, క్రిస్టియన్లను కేవలం ఓట్ల కోసమే వాడుకున్నాయని, వారి అభ్యున్నతికి మాత్రం సీఎం కేసీఆర్ కృషి చేశారన్నారు. తెలంగాణలో మైనార్టీల సంతోషాన్ని చూడలేక మత రాజకీయాలకు తెర లేపుతున్నారన్నారు. బీఆర్ఎస్ ఎప్పటికీ బీజేపీకి బీ టీం కాదనే విషయాన్ని మైనార్టీలు గ్రహించాలని సూచించారు. తెలంగాణలో హిందూ, ముస్లింలు ఐకమత్యంగా ఉంటూ జీవనం సాగిస్తుంటే, కాంగ్రెస్ పార్టీ జనాల సంతోషాన్ని చూడలేక మత చిచ్చు పెడుతుందన్నారు. ఆర్ఎస్ఎస్ మూలాలు ఉన్న రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌లో ఉండి మైనార్టీలపై కక్ష సాధించుకునే కుట్రలు చేస్తున్నాడని, ఇప్పటికైనా శత్రువులెవరో, మిత్రులెవరో గుర్తించి మైనార్టీలు ఓటేయాలన్నారు. మైనార్టీల అభ్యున్నతికి బీఆర్ఎస్ సర్కార్ కృషి చేస్తుందన్నారు. మైనార్టీలకు సముచిత స్థానాన్ని ఇస్తున్న బీఆర్ఎస్‌ను మరోసారి గెలిపించి కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేయాలన్నారు. ఖైరతాబాద్‌లో ఖబరస్థాన్ వివాదాన్ని కూడా పరిష్కారస్తామని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. ముస్లిం, క్రిస్టియన్లు ఐక్యంగా పనిచేసి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు.

## కేసీఆర్ నేతృత్వంలోనే మైనార్టీలు సుభిక్షం : హోంమంత్రి

ఖైరతాబాద్, అక్టోబర్ 30: 'యాభై ఏండ్ల కాంగ్రెస్ పాలనలో మైనార్టీలకు ఒరిగిందేమి లేదని, కేవలం ఓటు బ్యాంకుగానే చూశారే తప్పా..వారి అభివృద్ధికి ఎన్నడూ పాటుపడలేదని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే రాష్ట్రంలోని మైనార్టీలు సుభిక్షంగా ఉన్నారని పేర్కొన్నారు. జలవిహార్‌లో జరిగిన మైనార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు.సీఎం కేసీఆర్ సారథ్యంలో అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషంగా వర్ధిల్లుతున్నారని, అలాంటి క్రమంలో మరోసారి ప్రజలను విడగొట్టేందుకు కాంగ్రెస్, బీజేపీలు వస్తున్నాయన్నారు. వారిని దగ్గరికి రానివ్వొద్దని, ఎల్లప్పుడూ ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ మైనార్టీల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. జూబ్లీహిల్స్‌లో 3,500 మంది ముస్లింలకు షాదీముబారక్ పథకం ద్వారా సహాయం చేశామని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పేర్కొన్నారు. మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం మాజీ చైర్మన్ షేక్ అబ్దుల్లా సోహెల్ మాట్లాడుతూ.. డిసెంబర్ 3 తర్వాత రేవంత్ అండ్ బ్యాచ్‌ను ఇక్కడి నుంచి తరిమికొడుతామన్నారు.

## మతవాదంతోనే రాజ్యాంగ స్ఫూర్తికి దెబ్బ

**సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు**

హైదరాబాద్, అక్టోబర్ 30(నమస్తే తెలంగాణ): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిరంకుశ పాలన, మతవాదం, నకిలీ జాతీయవాదం మన రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బ తీస్తున్నదని, శాస్త్రీయ స్వభావం, హేతుబద్ధమైన ఆలోచన, భావప్రకటన స్వేచ్ఛపై దాడులు జరుగుతున్నాయని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. సీపీఐ యువజన విభాగమైన ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర రెండో మహాసభలు హైదరాబాద్‌లో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వ హయాంలో ఉపాధి హక్కు, జీవనోపాధి సమస్యల కోసం యువత పోరాడవలసిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. కేంద్రంలోని ప్రస్తుత ప్రభుత్వ విధానాల వల్ల నిరుద్యోగం, అసమానతలు పెరిగాయని చెప్పారు. యువతకు ఉద్యోగాలు, భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. యువత హక్కులు, భారతదేశ ప్రజాస్వామ్య, లౌకిక స్వభావం, జాతీయ ఐక్యతను కాపాడటానికి ఏఐవైఎఫ్ అవిశ్రాంత పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ భూస్థాపితం కావడం ఖాయం



మజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డితో సమావేశమైన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, కట్టెల శ్రీనివాస్ యాదవ్

- జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్
- మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డితో భేటీ

బంజారాహిల్స్, అక్టోబర్ 30: నమ్ముకున్న నాయకులతో పాటు ప్రజలను నట్టేట ముంచే కాంగ్రెస్ పార్టీని రానున్న ఎన్నికల్లో ప్రజలు భూస్థాపితం చేయడం ఖాయమని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్ రెడ్డిని సోమవారం ఎమ్మెల్యే మాగంటి, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి కట్టెల శ్రీనివాస్ యాదవ్‌తో పాటు వెళ్లి సమావేశమయ్యారు. సుమారు అరగంట సేపు నియోజకవర్గంలోని పరిస్థితులపై చర్చించారు. గత ఎన్నికల్లో 52వేల ఓట్లు సాధించిన తనకు కాదని నియోజకవర్గంతో ఎలాంటి సంబంధం లేని అజారుద్దీన్‌కు టికెట్ ఇవ్వడంలో పీజేఆర్ కుటుంబాన్ని దెబ్బతీసే కుట్ర దాగి ఉందని విష్ణువర్ధన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించి సొంతపార్టీ పెద్దలను సైతం ఎదిరించిన మహానేత పీజేఆర్ అభిమానులు, తెలంగాణ వాదుల సత్తా ఏంటో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చూపిస్తామని ఆయన అన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ.. తెలుగుయువత అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచీ పీజేఆర్‌ను రాజకీయాల్లో దగ్గరనుంచి గమనిస్తున్నానని, ఆయన పోరాటస్ఫూర్తి చాలా గొప్పదన్నారు. అలాంటి పీజేఆర్ కుటుంబాన్ని రాజకీయంగా దెబ్బతీసిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఏం న్యాయం చేస్తుందని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి రాజకీయ భవిష్యత్తు గురించి ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారని, సీఎం ఆదేశాలకు అనుగుణంగా విష్ణువర్ధన్‌రెడ్డికి తామంతా అండగా నిలబడతామని ఎమ్మెల్యే మాగంటి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలతో వేలాది మందికి లబ్ధి



మరాఠా సమాజ్ సభ్యులతో సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 30: బీఆర్ఎస్ సంక్షేమ పథకాల వల్ల వేలాది కుటుంబాలు లబ్ధి పొందారని , వారంతా కచ్చితంగా బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపిస్తారని ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లిలోని ఎమ్మెల్యే నివాసంలో సోమవారం మరాఠా సమాజ్‌కు చెందిన ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ... ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా నిరంతరం పాటుపడుతున్నామన్నారు. తాను చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి తనకు మద్దతు అందించడం ఆనందంగా ఉందన్నారు. బీఆర్ఎస్ సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని, ప్రతి నాయకుడు, కార్యకర్త ఓటరును కలువాలన్నారు. ఈ సందర్భంగా మరాఠా సమాజ్ నాయకులు మాట్లాడుతూ... నియోజకవర్గంలో ఎమ్మెల్యే అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్నారన్నారు. మరాఠా సమాజ్ అభివృద్ధికి ఆయన ఎనలేని కృషి చేశారని తెలిపారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేకే మరాఠా సమాజ్ పూర్తి మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మరాఠా సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

## అభివృద్ధే బీఆర్ఎస్ ధ్యేయం..



ఎమ్మెల్యే కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన దిల్‌కుషనగర్‌కు చెందిన యువకులు

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 30: సీఎం కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి, పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలు పార్టీలకు చెందిన యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం ఎమ్మెల్యే నివాసంలో బాలానగర్ డివిజన్ దిల్‌కుషనగర్ కాలనీకి చెందిన 30 మంది యువకులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనలో ఎనిమిదేండ్లలో రాష్ట్రం కనివినీ ఎరుగని రీతిలో అభివృద్ధిని సాధించిందని పేదందరికీ సంక్షేమ ఫలాలు అందాయన్నారు. నియోజకవర్గంలోని కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిచ్చి అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. కూకట్‌పల్లిలో మరింత అభివృద్ధి జరగాలంటే... బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు. కొత్తగా పార్టీలో చేరినవారు యువకులు ప్రజలను కలుస్తూ... సీఎం కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని.. కారు గుర్తుకు ఓటేసేలా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

## ఎన్ఆర్ఏఐ హైదరాబాద్ హెడ్‌గా సంపత్ తుమ్మల



రక్తదానం చేసిన సిబ్బందికి సర్టిఫికెట్లు అందజేస్తున్న హీరోలు అల్లరి నరేశ్, అడవిశేష్ తదితరులు

బంజారాహిల్స్, అక్టోబర్ 30: ప్రతిష్టాత్మక నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఎన్ఆర్ఏఐ) హైదరాబాద్ చాప్టర్ హెడ్‌గా జూబ్లీహిల్స్‌లోని స్పైసీ ఎవెన్యూ అధినేత సంపత్ తుమ్మల ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఎన్ఆర్ఏఐ జాతీయ పాలక మండలి సభ్యుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ, దేశంలోని పలు నగరాలకు చెందిన లక్షలాది రెస్టారెంట్లు, బార్స్, క్యాటరింగ్ సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎన్ఆర్ఏఐ హైదరాబాద్ చాప్టర్‌కు సంపత్ తుమ్ములను హెడ్‌గా ఎన్నుకున్నామన్నారు. ఈ ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో సుమారు 120 మంది రక్తదానం నిర్వహించారు. రక్తదానం చేసిన రెస్టారెంట్స్ సిబ్బందికి సినీనటులు అల్లరి నరేశ్, అడవి శేష్, దర్శకురాలు నందినీరెడ్డి తదితరులు సర్టిఫికెట్లు అందజేశారు.